www.aksharavelugu.com

# అక్షర వెలుగు

www.aksharavelugu.com

తెలుగు దిన పత్రిక

బుధ వారం
29 జూన్ 2022

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్

సంపుటి - 01, సంచిక-109

పేజీలు - 4 వెల రూ. 5

ఎడిటర్ :
గోసుకొండ పృధ్విరాజు

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Karimnagar, Warangal, Mahaboobnagar, Kammam, Medak


# హైకోర్టు సీజేగా జస్టిస్ ఉజ్జల్ భూయాన్ ప్రమాణస్వీకారం

రాజ్‌భవన్‌లో ప్రమానం చేయించిన గవర్నర్ తమిళసై ● హాజరైన సిఎం కెసిఆర్, పలువురు మంత్రులు





**హైదరాబాద్, జూన్ 28 (అక్షర వెలుగు):** తెలంగాణ హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా జస్టిస్ ఉజ్జల్ భూయాన్ ప్రమాణం చేశారు. రాజ్‌భవన్‌లో జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌తో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ప్రమాణస్వీకారం చేయించారు. తెలంగాణ హైకోర్టు ఐదో ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ ఉజ్జల్ భూయాన్ ప్రమాణం చేశారు. రాజ్‌భవన్‌లో జస్టిస్ ఉజ్జల్ భూయాన్ ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌తో ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రమాణస్వీకారానికి హాజరైన సిఎం కెసిఆర్ గవర్నర్ తమిళసైకి, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌కు పుష్పగుచ్చం అందించారు. ఈ కార్యక్రమానికి సీఎం కేసీఆర్, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, స్పీకర్ పోచారం శ్రీనివాస రెడ్డి, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మంత్రులు నిరంజన్ రెడ్డి, సత్యవతి రాథోడ్,సిఎస్ సోమేశ్ కుమార్, మేయర్ విజయలక్ష్మి, పిసిసి చీఫ్ రేవంత్ రెడ్డి, బి.వినోద్ కుమార్ తదితరులు హాజరయ్యారు. తెలంగాణలో సీజేగా సేవలందించిన జస్టిస్ సతీష్‌చంద్ర శర్మ ఢిల్లీ హైకోర్టుకు బదిలీ అయ్యారు. ప్రస్తుతం తెలంగాణ హైకోర్టులో సీనియారిటీ పరంగా రెండో స్థానంలో ఉన్న జస్టిస్ ఉజ్జల్ భూయాన్ సీజేగా పదోన్నతి పొందారు. రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ప్రమాణస్వీకారం చేసిన జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌కు పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన 1964 ఆగస్టు 2న అస్సాం రాజధాని గువాహటిలో జన్మించారు. తండ్రి సుచేంద్ర నాథ్ భూయాన్ ఆ రాష్ట్ర అడ్వొకేట్ జనరల్‌గా

2వ

## ఇంటర్ ఫలితాలు విడుదల



- ఫలితాలు విడుదల చేసిన మంత్రి సబిత
- ఫలితాల్లో మళ్లీ అమ్మాయిలదే హవా
- ఫస్టియర్‌లో 63.32 , సెకండ్ ఇయర్‌లో 67.16 శాతం ఉత్తీర్ణత
- ఆగస్టు 1వ తేదీ నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు
- ఈ నెల 30 నుంచి పరీక్ష ఫీజు చెల్లించేందుకు అవకాశం

**హైదరాబాద్, జూన్ 28 (అక్షర వెలుగు):** తెలంగాణలో ఇంటర్ ఫలితాలు విడుదయ్యాయి. ఇంటర్ బోర్డు కార్యాలయంలో మంగళవారం ఉదయం 11 గంటలకు విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఫలితాలను విడుదల చేశారు. అమ్మాయిలే మళ్లీ సత్తా చాటాలరు. ఫలితాలను విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి మంగళవారం ఉదయం 11 గంటలకు విడుదల

2వ

## పివికి తక్షణమే భారతరత్న ప్రకటించాలి



- ఆయనను విస్మరించడం బిజెపికి తగదు
- పివి జయంతి సందర్భంగా నివాళి అర్పించిన మంత్రులు

**హైదరాబాద్, జూన్ 28 (అక్షర వెలుగు):** తన పరిపాలనా దక్షతతో దేశ గౌరవాన్ని ఇనుమడింప చేసిన మాజీ ప్రధాని, దివంగత పీవీ నరసింహా రావుకు భారతరత్న ఇవ్వాలని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పీవీ 101 జయంతి సందర్భంగా నెక్లెస్ రోడ్‌లోని పీవీ ఘాట్‌లో మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, మహమూద్ అలీ, మల్లారెడ్డి, ఎమ్మెల్సీ సురభి వాణీదేవి, ప్రభుత్వ సలహాదారు రమణాచారి నివాళులు అర్పించారు.మాజీ ప్రధాని, తెలుగు బిడ్డ పీవీ నర్సింహారావును కేంద్రం విస్మరించడం బాధాకరమని

2వ

## దేశంలోనే అతిపెద్ద స్టార్టప్ ఇంక్యుబేటర్



- టీ హబ్ 2ను ప్రారంభించిన సీఎం కేసీఆర్
- మాదాపూర్‌లో అత్యున్నత ప్రమాణాలతో నిర్మాణం
- రు.400 కోట్ల పెట్టుబడితో 3ఎకరాల విస్తీర్ణంలో నిర్మాణం
- 3.70 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో సదుపాయాలు
- 4వేల స్టార్టప్‌లకు వసతి అవకాశాలు

**హైదరాబాద్, జూన్ 28 (అక్షర వెలుగు):** దేశంలోనే అతిపెద్ద స్టార్టప్ ఇంక్యుబేటర్ టీ హబ్ 2ను సీఎం కేసీఆర్ ప్రారంభించారు. మాదాపూర్‌లో అత్యున్నత ప్రమాణాలతో, అధునాతన సౌకర్యాలతో దీనిని నిర్మించారు. ఐటి రంగంలో ఇదో అద్భుతమైన కట్టడంగా

2వ

## 30న టెన్త్ ఫలితాలు విడుదల

**హైదరాబాద్, జూన్ 28 (అక్షర వెలుగు):** రాష్ట్రంలో ఇంటర్ ఫలితాలు విడుదల చేసిన ప్రభుత్వం.. పదో తరగతి ఫలితాలకు ముహూర్తం ఖరారు చేసింది. ఈ నెల 30న ఫలితాలు వెల్లడించేందుకు నిశ్చయించింది. రాష్ట్రంలో పదో తరగతి ఫలితాలు ఈనెల 30న విడుదల కానున్నాయి. గురువారం ఉదయం 11గంటలకు హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి

2వ

## ప్రధాని నరేంద్రమోడీ హైదరాబాద్ షెడ్యూల్ ఖరారు

- రెండ్రోజుల పాటు బిజెపి కార్యవర్గ సమావేశాలకు హాజరు
- 2న ప్రత్యేక విమానంలో బేగంపేటకు రాక.. రాజ్‌భవన్‌లో బస
- 2,3 తేదీల్లో హెచ్‌ఐసిసి సమావేశాల్లో పాల్గొననున్న ప్రధాని
- 3న సాయంత్రం పరేడ్‌గ్రౌండ్స్‌లో బహిరంగ సభకు హాజరు
- ప్రధాని, ముఖ్యమంత్రులు రాకతో భారీగా పోలీస్ బందోబస్తు



**హైదరాబాద్, జూన్ 28 (అక్షర వెలుగు):** ప్రధాని నరేంద్రమోడీ హైదరాబాద్ షెడ్యూల్ ఖరారైంది. బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశాల్లో పాల్గొనేందుకు వస్తున్న మోడీ తొలిసారి రెండు రోజుల పాటు హైదరాబాద్‌లో ఉండనున్నారు. జులై 2న స్పెషల్ ఫ్లైట్

2వ

## రిలయెన్స్ జియో ఛైర్మన్‌గా ఆకాశ్ అంబానీ

డైరెక్టర్ పదవికి ముఖేష్ అంబానీ రాజీనామా

**ముంబై, జూన్ 28 (అక్షర వెలుగు):** టెలికాం దిగ్గజం రిలయెన్స్ జియో డైరెక్టర్ పదవికి ముఖేష్ అంబానీ రాజీనామా చేశారు. ఆయన తనయుడు ఆకాష్ అంబానీ ఛైర్మన్ గా నియమితులయ్యారు. దీనికి బోర్డు మంగళవారం ఆమోద ముద్ర వేసింది. జూన్ 27వ తేదీన బోర్డ్

2వ

## తొలి తెలుగు ప్రధాని పివి నరసింహారావు

అసెంబ్లీ లాబీ హాల్‌లో నివాళి అర్పించిన స్పీకర్

**హైదరాబాద్, జూన్28(అక్షర వెలుగు):** పీవీ నరసింహరావు 101వ జయంతి సందర్భంగా శాసనసభ లాబీ హాల్‌లో స్పీకర్ పోచారం శ్రీనివాస రెడ్డి, శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మండలి విప్ యంయస్ ప్రభాకర్ రావు, అసెంబ్లీ సెక్రెటరీ డా.వి.నరసింహాచార్యులు పీవీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా స్పీకర్ పోచారం మాట్లాడుతూ దేశానికి ప్రధాని

2వ



## సంపాదకీయం

# పివి ఆర్థిక దార్శనికత ఎప్పుడూ అవసరమే !

ఆధునిక భారతంలో ఆర్థిక సంస్కరణలను మనదేశం అవలబించడం వల్లనే ఇవాళ మనమంతా ఈ స్థితిలో ఉన్నాం అని చెప్పుకోవడానికి దివంగత ప్రధాని పివి నరసింహారావును నిత్యం స్మరించుకోవాల్సింది. ఆర్థిక సంస్కరణలను ప్రతిపాదించినప్పుడు యధావిధిగానే కమ్యూనిస్టులు వ్యతిరేకించారు. అయితే ఆయన ధైర్యంగా వీటిని ముందుకు తీసుకుని వెళ్లిన ధీశాలి. పివి సంస్కరణలతో ప్రపంచంతో వాణిజ్యం పెరగడమే గాకుండా, మన యువత విదేశాలకు చదువులకు,ఉద్యోగాలకు వెళ్లగలిగే అవకాశాలను అందిపుచ్చుకున్నా రు. దేశం తీవ్ర ఆర్థికసంక్షోభంలో ఉన్నప్పుడు ,ఊహించని రీతిలో ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టి మార్కెట్ సరళీకరణ విధానాన్ని రూపొందించి భారత్‌కు మార్గాన్ని చూపారు. ఇప్పుడా మార్గంలోనే మన ఆర్థిక వ్యవస్థ నడు స్తోంది. ఆయన చూపిన బాట నుంచి పక్కకు తప్పినప్పుడల్లా మళ్లీ సంక్షోభాలు ఎదుర్కొంటున్నాం. యావత్ ప్రపంచం కరోనా సంక్షోభం ఎదుర్కొంటున్న ప్రస్తుత పరీక్షా కాలంలో సామాన్య మానవుడి మనుగడే ప్రశ్నార్థక మవుతున్నది. కరోనా సంక్షోభ సమయంలో,ఆర్థిక వ్యవస్థ గాడితప్పుతున్న నేపథ్యంలో, ప్రతి ఒక్కరికీ పీవీ ఆర్థిక సంస్కరణలే గుర్తుకు వస్తాయి. రాజనీతిజ్ఞత, ఆర్థిక సంస్కరణాభిలాష అన్నవి ప్రతిభ ఉండి అమలు చేయగల ధైర్యం ఉన్న నేతకు మాత్రమే సొంతం. ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన నాటికి దేశాన్ని కుదిపి వేస్తున్న ఆర్థిక సంక్షోభాన్ని చాకచక్యంగా పరిష్కరించి, దేశానికి బంగారు బాట వేసిన ధీశాలి పివి నరసింహారావు. దేశానికి అవసరమైన ఆర్థిక,రాజకీయ సంస్కరణలతో ముందుకు సాగిన రాజనీతి జ్ఞుడు పీవీ. కానీ ఆయన సంస్కరణలను మరింత ముందుకు తీసుకుని వెళ్లేలా తరవాతి ప్రభుత్వాలు విఫలం అయ్యాయి. పదేళ్లపాటు యూపిఎ ప్రభుత్వంలో ప్రధానిగా ఉన్న నాటి ఆర్థికమంత్రి మన్మోహన్ సింగ్ కూడా మళ్లీ వీటిని సమర్థంగా ముందుకు తీసుకుని వెళ్లలేదు. నేటి ప్రధాని మోడీ హయాంలో కూడా ఆర్థిక విధానాలు సక్రమంగా అమలు కావడం లేదు. బ్యాంకులు దివాళా తీయడం మొదలు, బ్యాంకులకు లక్షల కోట్లు ఎగవేసిన కొందరు విదేశాలకు ఉడాయించారు. ఇలాంటి చర్యలను నిరోధించేలా మోడీ చర్యలు తీసుకోవడం లేదు. పారిపోయిన వారిని వెనక్కి రప్పించి కఠిన చర్యలు అవలంబించడం లేదు. ఎందరో ఎంపిలు, మంత్రుల్లో ఆర్థిక ఎగవేతదారులు ఉన్నా వారిపై చర్యలు తీసుకోవడం లేదు. అందుకే ఆనాటి పరిస్థితులను నేటితో పోల్చుకోవాల్సి వస్తుంది. పివి తీసుకున్న నిర్ణయాల వల్ల సామాన్యులకు కూడా మేలు జరిగింది. రాజకీయాల్లో అరుదైన వ్యక్తిత్వాలు కలిగిన వారు బహు అరుదుగా వస్తుంటారని పివి నాడు పివి నిరూపించారు. అలాగే పదవుల కోసం వెంపర్లాడుతున్న నేటి రాజకీయాల్లో పదవులు వాటంతటవే వెతుక్కుంటూ రావడం...వాటికి వన్నె తేవడం కూడా పివికి మాత్రమే దక్కింది. పివి అనే మహానుభావుడు రాకుంటే భారత ఆర్థికస్థితి ఏమయ్యేదో అన్న భయం ఇప్పుడు కలుగుతోంది. అలాంటి మహానుభావుడు పివి రూపంలో భారతదేశానికి సాక్షాత్కరించడం కూడా దేశం చేసుకున్న అదృష్టంగా చూడాలి. భారతదేవ ఆర్థికి స్థితిగతులను బేరీజు వేసుకున్నప్పుడు పివికి ముందు పివి తరవాత అన్న లెక్కలు వేసుకునే స్థితి మనది. రాజకీయాల్లో రాణించడం కోసం ఎత్తులు పైఎత్తులు వేస్తూ..ఎదుటి వారిని బురిడీ కొట్టించడం అవసరమైతే ప్రత్యర్థులను మట్టుపెట్టడం లాంటి నేటితరం రాజకీయాల్లో అరుదైన వ్యక్తిత్వం కలిగిన మహానుభావుడు దివంగత పివి నరసింహారావు. ఆయన రాజకీయాల్లో స్వశక్తితతో,ప్రతిభతో రాణించారే తప్ప అడుగులకు మడుగులు ఒత్తి రాలేదు. అలాంటి వ్యక్తిని నీచాతినీచంగా అవమానించిన ఘనత సోనియా నాయకత్వంలోని నేటి కాంగ్రెస్ పార్టీది. దానిని మరచిన నేతలు నేడు ఆయనకు నివాళి అర్పిం చేందుకు పోటీ పడుతున్నారు. పివి కాంగ్రెస్‌కు ఎంతో పేరు తెచ్చారు. ఆయన పాలనా సంస్కరణలతో దేశానికి అలాగే కాంగ్రెస్ పార్టీకి చరిత్రలో లిఖించదగ్గ ఘట్టాలను అందించారు. అలాంటి మహానుభావుడి సేవలను కాదని ఆయనను తృణీకరించిన తీరుకు కాంగ్రెస్ ఇప్పటికీ పశ్చాత్తాపం చెందడం లేదు. పీవీ జీవిత కాలంలో అనేక సందర్భాలలో అవమానింది. ఆయనను తక్కువగా అంచనా వేసిన కాంగ్రెస్ ఇక ఎప్పటికీ కోలుకోదని ఇప్పటికే రుజువవ్యుంది. ఆయనకు చేసిన అవమానం అంతాఇంతా కాదు. కానీ పదవుల కోసం వెంపర్లాడే వారు పివిని అవమానించినా పట్టించు కోకుండా మిన్నకుండి ఇవాళ ఆయన గురించి మాట్లాడుతున్నారు. రాజకీయాల్లో స్థితప్రజ్ఞత ఉన్న అరుదైన నేతల్లో పివి ముందుంటారు. ఆయన స్వార్థం కోసం ఏనాడూ రాజకీయాలు చేయలేదు. అలాగే ఆయనలోని స్వార్థం దేశానికి మంచి చేయాలన్న తపన తప్ప మరోటి కాదు. అపర చాణుక్యుడు అంటూ ఆయనను కీర్తించినా రాజకీయాల కోసం తన చాణక్యాన్ని ఎప్పుడూ ప్రదర్శించలేదు. సానుకూల, ప్రతికూల రాజకీయాలను ఆమూలాగ్రం ఔపోసన పట్టిన ఘటికుడు ఆయన. అందుకే వాటిని అర్థం చేసుకుని అందుకు అనుగుణంగా పాలన చేసి..తిరుగలేని నేతగా రుజువు చేసుకున్నారు. నిజానికి పివి హయాం తరవాత సంకీర్ణాలు మొదలయ్యాయి. పివి కూడా ఆనాడు సంకీర్ణ రాజకీయాలకు తెరతీసి ఉంటే దేవేగౌడ స్థానంలో మళ్లీ పివియే ప్రధాని అయ్యేవారు. తనకున్న స్థానాలతో తానే మరోమారు ప్రధానిగా అయ్యేందుకు సంకీర్ణ రాజకీయాలు నెరపి ఉంటే భారత చరిత్ర మరోలా ఉండేది. అయినా ఆయన పాలనా కాలం ఓ స్వర్ణయుగం. ముఖ్యమంత్రిగా,కేంద్రమంత్రిగా,ప్రధాన మంత్రిగా,ఆర్థిక సంస్కరణలను అద్వితీయంగా అమలుపరిచిన పాలనాదక్షుడిగా పీవీ నరసింహరావు చరిత్ర సృష్టించారు.

పృధ్వీరాజ్ గోసుకొండ
ఎడిటర్

# దేశంలోనే అతిపెద్ద స్టార్టప్ ఇంక్యుబేటర్




(మొదటి పేజి తరువాయి) నిలిచిపోనుంది. ఈ క్యాంపస్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఐటీ మంత్రి కేటీఆర్, ఎంపీ రంజిత్ రెడ్డి, చీఫ్ సెక్రటరీ సోమేశ్ కుమార్, ఐటీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్ రంజన్ తదితరులు పాల్గొన్నారు. వరల్డ్ లార్జెస్ట్ ఇన్నోవేషన్ క్యాంపస్ అయిన టీ హబ్ 2ను ప్రభుత్వం రూ.400 కోట్ల పెట్టుబడితో 3ఎకరాల విస్తీర్ణంలో నిర్మించింది. ఇందులో ఒకేసారి 2 వేలకు పైగా స్టార్టప్‌లు తమ కార్యకలాపాలు నిర్వహించుకునే అవకాశముంది. శాండ్‌విచ్ ఆకారంలో కనిపిస్తూ.. అట్రాక్ట్ చేసేలా రూపుదిద్దుకున్న ఈ నిర్మాణంలో.. ప్రతీది ఓ అద్భుతంగా కనిపిస్తోంది. స్టార్టప్ లకు ప్రోత్సాహం కల్పించేలా 2015లో టీ హబ్ ను రాష్ట్ర సర్కార్ ఏర్పాటు చేసింది. ఇప్పుడు దానికి అనుబంధంగా సెకండ్ ఫేజ్ ను తీసుకొచ్చింది. ట్రిపుల్ ఐటీ ప్రాంగణంలో 70 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో టీ-హబ్ ఫస్ట్ ఫేజ్ ను అందుబాటులోకి తీసుకొచ్చారు. దానికి మంచి రెస్పాన్స్ రావడం, విజయవంతమైందని సర్కార్ భావించడంతో భారీగా ఇప్పుడు టీ-హబ్ సెకండ్ ఫేజ్ ను రాష్ట్ర ప్రభుత్వ నిధులతో నిర్మించారు. 400 కోట్ల రూపాయల ఖర్చుతో 3.70 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించిన టీ-హబ్ రెండో దశలో ఏకకాలంలో 4 వేల స్టార్టప్ లకు అవసరమైన వసతి కల్పించవచ్చని అధికారులు అంటున్నారు. తొలిదశతో పోలిస్తే ఐదు రెట్లు పెద్దదైన రెండోదశ ప్రపంచంలోనే అతిపెద్ద ఇంక్యుబేటర్ గా అవుతుందని చెబుతు న్నారు. మొదటిదశలో ప్రాథమిక స్థాయి వసతులు అందుబాటులో ఉండగా.. తాజా రెండో దశలో అత్యాధు నిక వసతులు కల్పించారు. పది అంతస్తుల్లో టీ-హబ్ రెండో దశ నిర్మాణం కాగా.. ప్రస్తుతానికి ఐదు అంతస్తుల్లో కార్యకలాపాలు మొదలుకానున్నాయి. ఇందులో ఆఫీసులు ఏర్పాటు చేయాలనుకునే వెంచర్ క్యాపిటలిస్టులు, స్టార్టప్ లు, ఇతర సంస్థలను నిపుణుల బృందం ఎంపిక చేస్తుంది. స్టార్టప్ సంస్కృతిని క్షేత్రస్థాయికి తీసుకెళ్లేందుకు రాబోయే రోజుల్లో వరంగల్, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్, మహబూబ్ నగర్ లో టీ-హబ్ రీజినల్ సెంటర్లు ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇన్నోవేషన్స్ కు షేప్ ను ఇచ్చే 'టీ-వర్క్స్ 'ను ఈ ఏడాది ఆగస్టులో, ఇమేజ్ సెంటర్‌ను మరో ఏడాదిన్నరలో ప్రారంభిం చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. టీ హబ్ మొదటి అంతస్తును వెంచర్ క్యాపిటలిస్టుల ఆఫీసుల కోసం పూర్తి ఉచితంగా కేటాయిస్తారు. ఇప్పటివరకు రెండు వీసీలు తమ కార్యాలయాలను ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చాయి. ప్రస్తుతం ట్రిపుల్ ఐటీ ప్రాంగణంలో ఉన్న తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్ ను ఇక్కడికి తరలించడంతోపాటు సైబర్ సెక్యూరిటీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, హైదరాబాద్ లో సీఐఐ ఏర్పాటు చేయనున్న 'సెంటర్ ఫర్ ఇన్నోవేషన్ అండ్ ఎంటర్ ప్రెన్యూర్ షిప్ 'కు ఆఫీసుకు వసతి కల్పిస్తారు. కేంద్ర ప్రభుత్వ 'స్టార్టప్ ఇండియా' స్టేట్ సెంటర్, కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖకు చెందిన 'అటల్ ఇన్నోవేషన్ సెంటర్ ' కూడా ఇక్కడే ఏర్పాటవుతాయి. ప్రస్తుతం ట్రిపుల్ ఐటీ ప్రాంగణంలోని టీ-హబ్ మొదటి దశకు చెందిన 215 స్టార్టప్ లను కొత్త బిల్డింగ్ లోకి తరలిస్తారని చెబుతున్నారు. ఇతర ఇంక్యుబేటర్ల తో పోలిస్తే తక్కువ అద్దెకు ఆఫీస్ స్పేస్ ఇక్కడ లభించనుంది. ట్రిపుల్ ఐటీ ప్రాంగణంలో 2015లో టీ-హబ్ తొలిదశ ఏర్పాటు చేశారు. అంతకుముందు హైదరాబాద్ లో కేవలం ట్రిపుల్ ఐటీ, ఐఎస్ బీ, జీనోమ్ వ్యాలీలో కలిపి మూడు ఇంక్యుబేటర్లు మాత్రమే ఉండేవి. ప్రస్తుతం 57 ఇంక్యుబేటర్లు పనిచేస్తున్నాయి. టీ-హబ్ తొలిదశ ప్రారంభం నుంచి ఇప్పటివరకు 1,100 స్టార్టప్ లు మొదలవగా.. 10 వేల కోట్ల రూపాయల ఫండింగ్ అందినట్టు అంచనా ఉంది. టీ హబ్ కొత్త ఫెసిలిటీ సెంటర్‌ను ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించి ప్రాంగణమంతా కేసీఆర్ కలియ తిరిగారు. టీ హబ్ ఫెసిలిటీ సెంటర్ ప్రత్యేకతలను అధికారులు సీఎం కేసీఆర్‌కు వివరించారు. కేసీఆర్ వెంట ఐటీ మంత్రి కేటీఆర్, డీజీపీ మహేందర్ రెడ్డి, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి జయేశ్ రంజన్‌తో పాటు పలువురు ఉన్నారు. దేశ, విదేశాలకు చెందిన వివిధ రంగాల ప్రముఖులు టీహబ్-2 ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. పనితీరులోనే కాదు.. భౌతికంగానూ హైదరాబాద్ ఐటీ కారిడార్‌లోనే ఎంతో ప్రత్యేకత కలిగిన భవనంగా టీ హబ్ 2.0 నిలుస్తోంది. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన నిర్మాణ శైలితో పాటు అత్యంత విశాలమైన 5 రోడ్ల కూడలిలో కొత్తగా రూపుదిద్దుకుంది. టీ హబ్ నుంచి 5 మార్గాల్లో వెళ్లేందుకు 100 అడుగుల నుంచి 120 అడుగుల రహదారులను నిర్మించారు.

## ప్రధాని నరేంద్రమోడీ హైదరాబాద్ షెడ్యూల్ ఖరారు



(మొదటి పేజి తరువాయి)లో బేగంపేట్ ఎయిర్ పోర్టుకు చేరుకోనున్నారు. అక్కడి నుంచి నేరుగా రాజ్ భవన్ వెళ్తారు. అనంతరం హెచ్ఐసీసీలో జరిగే కార్యవర్గ సమావేశాల్లో పాల్గొంటారు. మొదటి రోజు కార్యక్రమం పూర్తయిన అనంతరం తిరిగి రాజ్ భవన్ చేరుకోని రాత్రికి అక్కడే బస చేయనున్నారు. జులై 3న హెచ్ఐసీసీలో జరిగే రెండు రోజు కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం సాయంత్రం పరేడ్ గ్రౌండ్ లో జరిగే బహిరంగ సభలో పాల్గొంటారు. సభ అనంతరం ఆ రాత్రికి రాజ్ భవన్‌లో బస చేస్తారు. 4న ఉదయం బేగంపేట్ ఎయిర్ పోర్ట్ నుంచి ప్రత్యేక విమానంలో వెళ్లనున్నారు. ప్రధాని రాక నేపథ్యంలో హెచ్ఐసీసీలో జరిగే బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశాలకు, పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే బహిరంగ సభకు భారీ భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రధాని రెండు రోజుల పర్యటన సందర్భంగా 5వేల మందికి పైగా పోలీసు బలగాలతో సెక్యూరిటీ ఉంటుంది. హెచ్ఐసీసీతో పాటు పరేడ్ గ్రౌండ్స్ వద్ద మూడంచెల భద్రత ఏర్పాట్లు చేస్తున్నారు. ఎస్పీజీ కమాండోలతో పాటు కేంద్ర బలగాలు పహారా కాయనున్నాయి. సైబరాబాద్, హైదరాబాద్ కమిషనరేట్లకు చెందిన ఇద్దరు డీసీపీ స్థాయి అధికారులు, ఎస్పీజీ బలగాలతో కమ్యూనికేట్ చేసుకుంటారు. పీఎంఓతో పాటు ఎస్పీజీ సీనియర్ అధికారులు ఇప్పటికే రాష్ట్ర పోలీస్ అధికారులతో మాట్లాడి.. భద్రతా వివరాలు ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నారు. హెచ్ఐసీసీ, పరేడ్ గ్రౌండ్స్, రాజ్ భవన్ ఏరియాలను 48గంటల ముందు నుంచే ఎస్పీజీ బృందాలు ఆధీనంలోకి తీసుకోనున్నాయి. పీఎం మోడీ మినిట్ టు మినిట్ ప్రోగ్రామ్ షెడ్యూల్ పై పీఎంఓ అధికారులతో హైదరాబాద్ పోలీసులు ఇప్పటికే చర్చించారు. జూలై 2,3న వెదర్ రిపోర్ట్స్ కూడా భద్రతా విభాగానికి వాతావరణ శాఖ అధికారులు అందించారు. ప్రధానితో పాటు కేంద్ర మంత్రులు, వివిధ రాష్ట్రాల సీఎంలు కూడా హైదరాబాద్ కు రానున్నారు. వారి భద్రత కోసం అదనపు బలగాలను సిద్ధంగా ఉంచాలని రాష్ట్ర పోలీసులు నిర్ణయించారు. కార్యవర్గ సమావేశాలకు వచ్చే అతిథుల కోసం సిటీలోని టాప్ హోటల్స్‌లో రూమ్స్ బ్లాక్ చేశారు. ఆయా హోటల్స్ చుట్టూ భద్రత ఏర్పాటు చేస్తున్నారు. వీఐపీలు ఉండే హోటల్స్ లో పనిచేస్తున్న వారి ఆధార్‌తో పాటు ఐడీ కార్డులను పరిశీలిస్తున్నారు. వీళ్ళకి స్పెషల్ ఐడీ కార్డులు జారీ చేస్తారు. గతంలో ఏదైనా నేర చరిత్ర ఉందా అనే అంశాలను కూడా పరిశీలిస్తున్నారు. పీఎం మోడీ టూర్ సెక్యూరిటీకి సంబంధించి హైదరాబాద్, సైబరాబాద్ పోలీసులు ఎస్పీజీ బృందాలతో నిరంతరం కో ఆర్డినేట్ చేసుకుంటున్నారు.

# తొలి తెలుగు ప్రధాని పివి నరసింహారావు



(మొదటి పేజి తరువాయి) అయిన పీవీ తెలంగాణ బిడ్డని కొనియాడారు. ఈ రోజు దేశం ఆర్థిక సమస్యలను తట్టుకుని నిలబడుతుందంటే దానికి కారణం పీవీ తెచ్చిన ఆర్థిక సంస్కరణలే కారణమన్నారు. భూ సంస్కరణలను కూడా అమలు చేసింది ఆయనేనన్నారు. పీవీ చూపించిన బాటలో మనమందరం పయనించాలని పోచారం శ్రీనివాస రెడ్డి పిలుపునిచ్చారు. శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ దేశంలోనే 130 కోట్ల మంది ప్రజలు గౌరవించే వ్యక్తి పీవీ అన్నారు. 14 భాషలు తెలిసిన బహు భాషా కోవిదుడని కొనియాడారు. మనమందరం ఆయనను గుర్తు పెట్టుకోవాల్సిన అవసరం ఉందని, వారి ఆశయాలకు అనుగుణంగా నడవాల్సిన అవసరం ఉందన్నారు.

## పివికి తక్షణమే భారతరత్న ప్రకటించాలి



(మొదటి పేజి తరువాయి) మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. కిష్ట పరిస్థితులలో ఉన్న దేశాన్ని ఆర్థిక సంస్కరణలు తీసుకొచ్చి అభివృద్ధిలోకి తీసుకువచ్చిన పీవీకి భారతరత్న ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రపంచ దేశాలకు భారతదేశ ఖ్యాతిని చాటి చెప్పిన పీవీని గౌరవించకపోవడం విచారకరమన్నారు. పీవీ శతజయంతి సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం ఏడాది పొడవునా వేడుకలు నిర్వహించి గౌరవించిందని తెలిపారు. మన మధ్య భౌతికంగా లేకపోయిన మన గుండెల్లో చిరస్థాయిగా నిలిచే గొప్ప వ్యక్తి పీవీ నర్సింహా రావు అని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ కొనియాడారు.

## 30న టెన్త్ ఫలితాలు విడుదల

(మొదటి పేజి తరువాయి) మానవ వనరుల కేంద్రంలో పదో తరగతి ఫలితాలను విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి విడుదల చేయనున్నారు. మే 23 నుంచి ఈనెల 1 వరకు రాష్ట్రంలో పదో తరగతి పరీక్షలు జరిగాయి. రాష్ట్రవ్యాప్తంగా 11,401 పాఠశాలలకు చెందిన 5,9,275 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఫలితాలను వెంటనే వెబ్‌సైట్‌లో అందుబాటులోకి తెస్తారు.

## రిలయెన్స్ జియో ఛైర్మన్‌గా ఆకాశ్ అంబానీ



(మొదటి పేజి తరువాయి) ఆఫ్ డైరెక్టర్స్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ముఖేష్ జూన్ 27వ తేదీన అంబానీ కంపెనీ డైరెక్టర్ పదవికి రాజీనామా చేసినట్లు కంపెనీ తెలిపింది. 2022, జూన్ 27వ తేదీ నుంచి డైరెక్టర్ లుగా రమిందర్ సింగ్, కేవీ చౌదరిగా కొనసాగనున్నారు. ఇందుకు షేర్ హోల్డర్స్ ఆమోద ముద్ర వేయాల్సి ఉంది. వీరి పదవికాలం ఐదేళ్లు. కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్లుగా పంకజ్ మోహన్ పవార్ నియామకాన్ని బోర్డు ఆమోదించింది. 2021లో నాయకత్వ మార్పుల్లో భాగంగా తన పిల్లలు బాధ్యతలు తీసుకుంటారని గతంలో అంబానీ చెప్పారు. రిలయన్స్ వ్యవస్థాపకుడైన ధీరుభాయ్ అంబానీ దేశాభివృద్ధికి దోహదపడ్డారని.. తన పిల్లలు కూడా అదే విధంగా వ్యవహరిస్తారన్నారు. 2019లో జియో ప్లాట్ ఫారమ్ స్థాపించబడ్డాయి. ఆసియాలోనే అత్యంత సంపన్నుల్లో ఒకరైన ముకేష్ అంబానీకి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. 2002లో రిలయెన్స్ ఇండస్ట్రీస్ ఛైర్మన్ గా ముకేష్ బాధ్యతలు చేపట్టారు. తన సామ్రాజ్యాన్ని వారసుల చేతుల్లోకి వ్యాపార పగ్గాలు అప్పగిస్తారని అప్పట్లోనే ప్రచారం జరిగింది. ఈ విషయంలో ముఖేష్ అంబానీ ముందు చూపుతో వ్యవహరిస్తున్నారు. యంగ్ జనరేషన్ ను సీనియర్లు గైడ్ చేయనున్నారు. త్వరలోనే నాయకత్వ మార్పు ఉంటుందని గతంలో వెల్లడించిన సంగతి తెలిసిందే. రిలయెన్స్ ఇండస్ట్రీస్ నెంబర్ వన్ గా నిలబెట్టిన ఘనత ముఖేష్ కే దక్కుతుంది. కంపెనీని విస్తరిస్తూ.. ప్రతి అడుగుల్లో విజయాన్ని అందుకుంటూ.. అతిపెద్ద సామ్రాజ్యాన్ని సృష్టించాడు. చాలా వ్యాపారాల్లో సత్తా చాటుతూ.. ముందుకు వెళు తున్నారు. వారసులను నేరుగా రంగంలోకి దింపి..వాళ్లు వ్యాపారం ఎలా నడుపుతారో చూడాలని ముఖేష్ అనుకుంటున్నట్లు తెలుస్తోంది. అందుకే నాయకత్వాన్ని బదిలీ చేస్తున్నట్లు సమాచారం.

## సంజయ్ రౌత్‌కు మరోమారు సమన్లు

### భూ కుంభకోణంలో విచారణకు

### హాజరు కావాలని ఆదేశాలు

**ముంబై, జూన్ 28 (అక్షర వెలుగు):** శివసేన నేత, ఎంపీ సంజయ్ రౌత్ కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఈడీ మళ్లీ సమన్లు జారీ చేసింది. 24 గంటలు కూడా గడవక ముందే ఆయనకు ఈడీ రెండోసారి సమన్లు జారీ చేయడం గమనార్హం. ప్రవీణ రౌత్, పత్రా చావల్ ల్యాండ్ స్కామ్ కేసులో సంజయ్ మంగళవారం విచారణకు హాజరుకావాలని ఈడీ ఆదేశించింది. కానీ ఏజెన్సీ ముందు హాజరు కావడానికి తనకు మరికొంత సమయం ఇవ్వాలని సంజయ్ ఈడీని కోరారు. ఈ క్రమంలో జులై 1న తమ ముందు విచారణకు హాజరు కావాలని ఈడీ ఆదేశిస్తూ కొత్తగా మళ్లీ సమన్లు జారీ చేసింది. నగదు అక్రమ చలామణి వ్యవహారం కేసులో ప్రశ్నిస్తామని, అందుకోసం తమ ఎదుట హాజరు కావాలని రౌత్‌కు జారీ చేసిన సమన్లలో ఈడీ పేర్కొంది. కాగా రూ.1,034 కోట్ల విలువైన పత్రా చాల్ భూ కుంభకోణం కేసులో సంజయ్ రౌత్, ఆయన కుటుంబ సభ్యులకు చెందిన రూ.11.15 కోట్లు విలువైన ఆస్తులను ఈడీ ఏప్రిల్ నెలలో జప్తు చేసింది.

## హైకోర్టు సీజేగా జస్టిస్ ఉజ్జల్ భూయాన్ ప్రమాణం



(మొదటి పేజి తరువాయి) సేవలందించారు. జస్టిస్ ఉజ్జల్ భూయాన్ ప్రాథమిక స్థాయి నుంచి ఎల్ఎల్ఎం వరకు గువాహటిలోనే విద్యాభ్యాసం పూర్తిచేశారు. 1991 మార్చి 20న న్యాయవాదిగా పేరు నమోదు చేసుకొని అక్కడి హైకోర్టులో వృత్తి జీవితం ప్రారంభించారు. హైకోర్టు పరిధిలోని అగర్తల, షిల్లాంగ్, కొహిమా, ఈటానగర్ బెంచిల ముందు వాదనలు వినిపించారు. ఆదాయపన్ను శాఖ స్టాండింగ్ కౌన్సిల్‌గా పనిచేశారు. 2002 ఏప్రిల్ నుంచి 2006 అక్టోబరు వరకు మేఘాలయలో ప్రభుత్వ అదనపు అడ్వొకేట్‌గా, 2005 నుంచి 2009 వరకు అరుణాచల్‌ప్రదేశ్ అటవీశాఖ ప్రత్యేక న్యాయవాదిగా సేవలందించారు. బిజస్టిస్ 2010 మార్చి 3న గువాహటి హైకోర్టు స్టాండింగ్ కౌన్సిల్‌గా నియమితు లయ్యారు. 2010 సెప్టెంబరు 6న సీనియర్ అడ్వొకేట్ హోదా పొందారు. 2011 జులై 21న అస్సాం ప్రభుత్వ అదనపు అడ్వొకేట్ జనరల్‌గా నియమితులయ్యారు. అదే ఏడాది అక్టోబరు 17న గువాహటి హైకోర్టులో అదనపు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2013 మార్చి 20న శాశ్వత న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. 2019 అక్టోబరు 3న బాంబే హైకోర్టుకు బదిలీ అయ్యారు. 2021 అక్టోబరు 22న తెలంగాణ హైకోర్టుకు వచ్చారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గానూ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా 2021 అక్టోబరు 11 నుంచి పనిచేస్తున్న జస్టిస్ సతీష్‌చంద్ర శర్మ ఇకపై దిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా సేవలు అందించనున్నారు.

# ఇంటర్ ఫలితాలు విడుదల



(మొదటి పేజి తరువాయి) చేశారు. ఇంటర్ ఫస్టియర్, సెంకడ్ ఇయర్ ఫలితాలను వెబ్‌సైట్‌లో చూడొచ్చు. ఈ ఏడాది ఫలితాల్లో విద్యార్థులు ఫస్టియర్‌లో 63.32 శాతం, సెకండ్ ఇయర్‌లో 67.16 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ ఏడాది ఫలితాల్లో కూడా అమ్మాయిలు సత్తా చాటారు. కాగా, ఆగస్టు 1వ తేదీ నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను నిర్వహించనున్నారు. ఫస్టియర్ ఫలితాల్లో మేడ్చల్ జిల్లా మొదటి స్థానంలో, హన్మకొండ జిల్లా రెండో స్థానంలో నిలిచింది. మే 23న ఇంటర్ పరీక్షలు పూర్తి కాగా.. ఫలితాలు కాస్తా ఆలస్యంగా విడుదలయ్యాయి. ఈ ఏడాది 9 లక్షల మంది విద్యార్థులు ఇంటర్ పరీక్షలకు హాజరయ్యారు. మే 6వ తేదీన మొదలైన ఇంటర్మీడియట్ పరీక్షలు మే 24న ముగిసిన విషయం తెలిసిందే. ఈ ఏడాది ఇంటర్ ఫస్టియర్, సెకండియర్‌తో కలిపి మొత్తం 9,07,393 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. విద్యార్థులు ఇంటర్ ఫలితాలను ప్రభుత్వ వెబ్‌సైట్లలో అందుబాటులో ఉంచింది. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో 62శాతం ఉత్తీర్ణత నమోదైంది. మొదటి సంవత్సరంలో 4,64,892 మంది విద్యార్థులు హాజరవగా.. ఇందులో 2,94,378 మంది పాసవగా.. 63.32శాతం ఉత్తీర్ణత నమోదైంది. జనరల్‌లో 4,14,380 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవగా.. 2,68,763 మంది పాసవగా.. 64శాతం ఉత్తీర్ణత సాధించారు. వొకేషనల్‌లో 50,512 మంది పరీక్షలు రాయగా.. 25,615 మంది ఉత్తీర్ణత సాధించగా.. 54.25శాతం ఉత్తీర్ణత నమోదైంది. బాలికలు 72.33శాతం, బాలురు 54.25శాతం ఉత్తీర్ణత నమోదైంది. ద్వితీయ సంవత్సరంలో మొత్తం 4,42,895 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా.. 2,97,458 మంది ఉత్తీర్ణత సాధించారు. 67.16 శాతం ఉత్తీర్ణత నమోదైంది. బాలికలు 75.33శాతం, బాలురు 59.21 శాతం పాసయ్యారు. ఇంటర్మీడియట్ ఫలితాలను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి విడుదల చేశాక మాట్లాడుతూ.. కరోనా వల్ల గడిచిచిన రెండేళ్లు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నామని తెలిపారు. విద్యార్థులకు నష్టం జరగకుండా ఆన్‌లైన్‌లో బోధన చేశాం. గతేడాది 70 శాతం సిలబస్‌తోనే పరీక్షలు నిర్వహించామని చెప్పారు. విద్యార్థుల్లో ఒత్తిడి తగ్గించేందుకు కౌన్సెలింగ్‌లు కూడా నిర్వహించామని పేర్కొన్నారు. ఇంటర్ ఫస్టియర్, సెకండియర్‌లో ఫెయిల్ అయిన విద్యార్థులకు ఆగస్టు 1 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తాం. ఈ నెల 30 నుంచి పరీక్ష ఫీజు స్వీకరిస్తాం. రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్ కూడా అవకాశం కల్పించామని మంత్రి తెలిపారు. ఆగస్టు చివరి నాటికి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలను విడుదల చేస్తామని సబితా ఇంద్రారెడ్డి ప్రకటించారు. కార్యక్రమంలో బోర్డు కార్యదర్శి జలీల్ తదితరులు పాల్గొన్నారు.

# టిహబ్‌కు ప్రముఖుల ప్రశంసలు



హైదరాబాద్‌కుమరో ఆణిముత్యమని కితాబు ❍రతన్ టాటా మొదలు.. పలువురు ప్రభుత్వానికి అభినందనలు

**హైదరాబాద్, జూన్ 28 (అక్షర వెలుగు):** టీహబ్2.0 ప్రారంభోత్సవం సందర్భంగా దేశవిదేశాల ప్రముఖులు, పారిశ్రామికవేత్తలు ట్విట్టర్ వేదికగా హర్షం వ్యక్తం చేశారు. దేశ స్టార్టప్ ఎకో సిస్టమ్‌కు టీ హబ్ 2.0 గొప్ప వరమని కితాబిచ్చారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఇన్నోవేషన్ క్యాంపస్ ఏర్పాటు చేసిన తెలంగాణ సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, రాష్ట్ర ప్రభుత్వానికి అభినందనలు తెలిపారు. హైదరాబాద్‌లో కొత్త టీ-హబ్ ఏర్పాటు చేసిన తెలంగాణ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావుకు అభినందనలు. భారత స్టార్టప్ ఎకోసిస్టమ్‌కు ఇది గొప్ప ఊతమిస్తుందని ప్రముఖ పారిశ్రామికవేత్త రతన్ టాటా అన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఇన్నోవేషన్ క్యాంపస్‌ను ఏర్పాటు చేసిన కేటీఆర్‌కు అభినందనలు. టీహబ్ హైదరాబాద్ ప్రపంచవ్యాప్తంగా ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్‌ను ప్రోత్సహించడంలో విజయవంతమైనందుకు ఆనందంగా ఉంది. ఆల్ ది వెరీ బెస్ట్ అని సాప్ ల్యాబ్స్ ఇండియా ఎండీ, సింధు గంగాధరన్ పేర్కొన్నారు. హ్యాపనింగ్ హైదరాబాద్‌కు మరో మైలురాయి. ఏసియాలో అతిపెద్ద ఇంక్యుబేటర్ తలుపులు తెరుచుకున్నాయి. అపురూపమైన స్పేస్, అపురూపమైన ఎనర్జీ, అపురూపమైన స్టార్టప్ ఎకోసిస్టమ్.. ఇన్నోవేషన్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌కు అద్భుతమైన ప్రోత్సాహాన్ని అందించనున్నాయి. టీహబ్ ఫేజ్-2కు యూకే ఇన్ హైదరాబాద్ శుభాకాంక్షలు అంటూ డాక్టర్ ఆండ్రూ ఫ్లెమింగ్, ఏపీ అండ్ టీఎస్ యూకే హైకమిషనర్ తెలిపారు. భారత్‌లో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌కు మరింత బలం చేకూర్చేందుకు ప్రపంచంలోనే అతిపెద్ద ఇన్నోవేషన్ క్యాంపస్ ఉపయోగపడుతుంది. టీ-హబ్ 2.0ను ప్రారంభించిన నా స్నేహితుడు కేటీఆర్, ఆయన బృందానికి శుభాకాంక్షలు అని గోవా ఎమ్మెల్యే రోహన్ ఖౌంటే అన్నారు. మంత్రి కేటీఆర్ ఆలోచన నుంచి పుట్టిన టీహబ్ కొత్త సౌకర్యం హైదరాబాద్ ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్‌ను అగ్రస్థానానికి తీసుకెళ్లడానికి 8 సంవత్సరాలుగా ఎడతెరపిలేకుండా చేస్తున్న ప్రయత్నాల ప్రతిరూపం అని ఎంపీ రంజిత్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌కు టీ హబ్ రెండో దశ మరో కలికితురాయని ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ పేర్కొన్నారు. టీ హబ్ రెండో దశ ప్రారంభంపై మంగళవారం ఆయన ట్వీట్ చేశారు. దేశంలోనే తెలంగాణ వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. తెలంగాణ, హైదరాబాద్ దేశంలోనే అత్యంత ప్రగతిశీల రాష్ట్రం, నగరంగా మారుతున్నాయని అసదుద్దీన్ ఒవైసీ పేర్కొన్నారు. అత్యాధునిక సాంకేతికత, ఆవిష్కరణలకు హైదరాబాద్ విశ్వకేంద్రం మారాలని ఆశిస్తున్నానని తెలిపారు.

## డబుల్ ఇళ్ల కోసం పేదల ఆందోళన

**హనుమకొండ, జూన్ 28 (అక్షర వెలుగు):** జిల్లాలోని బస్టాండ్ సమీపంలో గల అంబేద్కర్ నగర్ కాలనీలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించాలంటూ మంగళవారం ఉదయం పేదలు ధర్నాకు దిగారు. డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించి ఐదేళ్లు గడిచినా ఇళ్లను పంపిణీ చేయడం లేదని వారు ఆరోపిస్తున్నారు. ఇళ్లలోకి వెళ్లేందుకు పేదలు యత్నించారు. వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని ఆందోళనకారులను అడ్డుకున్నారు. పరిస్థితిని అదుపు చేసేందుకు యత్నిస్తున్నారు.

## సోషల్ మీడియా ద్వారా మనోభావాలు దెబ్బతీత

వెబ్‌సైట్ సహ వ్యవస్థాపకుడు మహ్మద్ జుబైర్ అరెస్ట్

**న్యూఢిల్లీ, జూన్ 28 (అక్షర వెలుగు):** మత పరమైన మనో భావాలను దెబ్బతీయడంతో పాటు, అల్లర్లను రెచ్చగొట్టారని ఆరోపిస్తూ ఫ్యాక్ట్ చెకింగ్ వెబ్‌సైట్ ఆల్ట్ న్యూస్ సహ వ్యవస్థాపకుడు మహ్మద్ జుబైర్‌ను ఢిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. ట్విటర్‌లో ఢిల్లీ పోలీసులను ట్యాగ్ చేసిన వ్యక్తి ఫిర్యాదు ఆధారంగా అతన్ని అరెస్టు చేశారు.జుబైర్‌పై భారతీయ శిక్షాస్మృతిలోని సెక్షన్‌లు 153, 295ఎ కింద అభియోగాలు మోపారు.జుబైర్‌ను ఢిల్లీలోని బురారీలోని డ్యూటీ మేజిస్ట్రేట్ నివాసంలో హాజరుపర్చారు. అనంతరం అతడిని ఒకరోజు పోలీసు కస్టడీకి తరలించారు.మత సామరస్యానికి విఘాతం కలిగించే ట్వీట్ల గురించి ట్విట్టర్ హ్యాండిల్ పోలీసులను అప్రమత్తం చేయడంతో జుబైర్‌ను ఢిల్లీ పోలీసు విభాగం అరెస్టు చేసింది. ఆల్ట్ న్యూస్ సహ వ్యవస్థాపకుడు ప్రతీక్ సిన్హా మాట్లాడుతూ, జుబైర్ కు నోటీసు ఇవ్వలేదని, పలుసార్లు అభ్యర్థించినా ఎఫ్ఐఆర్ కాపీని ఇవ్వలేదన్నారు. జుబైర్ అరెస్టు నిజంపై దాడిగా కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ అభివర్ణించారు.

# మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు హైకోర్టులో చుక్కెదురు

త్వరలోనే పిటిషన్‌పై విచారణ


చేపడతామన్న కోర్టు




**హైదరాబాద్, జూన్ 28 (అక్షర వెలుగు):** మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు హైకోర్టులో చుక్కెదురైంది. ఎమ్మెల్యేగా తన ఎన్నిక చెల్లదంటూ దాఖలైన పిటిషన్‌ను తిరస్కరించాలని అభ్యర్థించగా.. న్యాయస్థానం తిరస్కరించింది. త్వరలోనే పిటిషన్‌పై విచారణ చేపట్టనుంది. ఎమ్మెల్యేగా తన ఎన్నిక చెల్లదంటూ దాఖలైన పిటిషన్‌ను తిరస్కరించాలన్న మంత్రి కొప్పుల ఈశ్వర్ అభ్యర్ధనను హైకోర్టు తోసిపుచ్చింది. ధర్మపురి నియోజకవర్గం నుంచి 2018లో ఎన్నికల్లో తెరాస నుంచి కొప్పుల ఈశ్వర్.. కాంగ్రెస్ నుంచి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పోటీ చేశారు. ఈవీఎంల వీవీ ప్యాట్ లెక్కించకుండానే కొప్పుల ఈశ్వర్ గెలుపొందినట్లు ప్రకటించారని.. అది ప్రజాప్రాతినిధ్య చట్టానికి విరుద్ధమని 2019లో లక్ష్మణ్ హైకోర్టును ఆశ్రయించారు.కాంగ్రెస్ అభ్యర్థి లక్ష్మణ్ పిటిషన్‌ను తిరస్కరించాలని.. న్యాయస్థానాన్ని కొప్పుల ఈశ్వర్ కోరారు. పిటిషన్‌లో సరైన కారణాలు చూపలేదని కొప్పుల ఆరోపించారు. ఇరువైపుల వాదనలు విన్న హైకోర్టు... కొప్పుల ఈశ్వర్ పిటిషన్ కొట్టివేసింది. కాంగ్రెస్ అభ్యర్థి లక్ష్మణ్ పిటిషన్‌పై త్వరలోనే హైకోర్టు విచారణ చేపట్టనుంది. తాను గత అసెంబ్లీ ఎన్నికల్లో నాలుగు వందల పైచిలుకు ఓట్ల తేడాతో ఓడిపోయాను అని అప్పటి కలెక్టర్ ప్రకటించారని ధర్మపురి కాంగ్రెస్ అభ్యర్థి అట్లూరి లక్ష్మణ్ అన్నారు. మూడు ఈవీఎంలు కౌంటింగ్ తేడా ఉందని చెప్పినా వినకుండా ప్రకటించారని, తాను రీకౌంటింగ్ చేయాలని కోరానని .. అయినా రీకౌంటింగ్ చెయ్యలేదని గుర్తుచేశారు. తన దగ్గర ఉన్న పూర్తి ఆధారాలను హైకోర్టుకి అందించానని తెలిపారు. రీకౌంటింగ్‌కి కొప్పుల ఈశ్వర్ ఎందుకు ఒప్పుకోవడం లేదన్నారు. హైకోర్ట్ ద్వారా రీకౌంటింగ్‌కి ఆదేశాలు జారీచేస్తారని ఆశిస్తున్నానని పేర్కొన్నారు. కొప్పులకి నిజాయితీ ఉంటే... రికౌంటింగ్‌కి ఒప్పుకోవాలన్నారు.

## పల్లోంజీ గ్రూప్ చైర్మన్ పల్లోంజీ మిస్త్రీ కన్నుమూత

నిద్రలో కన్నుమూసినట్లు గుర్తింపు



**ముంబై, జూన్ 28 (అక్షర వెలుగు):** బిజినెస్ టైకూన్ షాపూర్జీ పల్లోంజీ గ్రూప్ చైర్మన్ పల్లోంజీ మిస్త్రీ (93) కన్నుమూశారు. ముంబైలోని తన నివాసంలో సోమవారం రాత్రి తుదిశ్వాస విడిచారు. నిద్రలోనే ఆయన కన్నుమూసినట్టు తెలుస్తోంది. 18.4 శాతం వాటాతో టాటా గ్రూప్‌లో అతిపెద్ద వ్యక్తిగత వాటాదారుగా పల్లోంజీ ఉన్నారు. 1929లో జన్మించిన మిస్త్రీ లండన్‌లోని ఇంపీరియల్ కాలేజీలో ఉన్నత విద్యను అభ్యసించారు. అంతకుముందు ముంబైలోని కేథడ్రల్ జాన్ కానన్ స్కూల్‌లో చదువుకున్నారు. కేవలం18 సంవత్సరాల వయస్సులో కరియర్‌ను స్టార్ట్ చేసిన ఆయన క్రమంగా బడా పారిశ్రామికవేత్తగా రాణించారు. 28.90 బిలియన్ డాలర్లతో పల్లోంజీ మిస్త్రీ బిలియనీర్‌గా ఉన్నారు. ఫోర్బ్స్ ప్రకారం భారతదేశంలో 5వ అత్యంత సంపన్న వ్యక్తిగా ఉన్నారు. పార్సీ కుటుంబంలో జన్మించిన షాపూర్జీ 2003లో వివాహం ద్వారా ఐరిష్ పౌరసత్వాన్ని పొందారు. వాణిజ్య రంగంలో చేసిన విశేష సేవలకుగాను 2016లో అత్యున్నత పౌర పురస్కారాలలో ఒకటి పద్మభూషణ్ అందుకున్నారు. 1865లో స్థాపితమై ఇంజనీరింగ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, రియల్ ఎస్టేట్, వాటర్, ఎనర్జీ, ఫైనాన్షియల్ సర్వీసెస్‌లో వ్యాపారాలను పల్లోంజీ గ్రూపు నిర్వహిస్తోంది. ముంబైకి చెందిన 156 ఏళ్ల ఈ గ్రూప్ ఇప్పుడు ఆఫ్రికా, ఇండియా, మిడిల్ ఈస్ట్, దక్షిణాసియాలో నిర్మాణ వ్యాపారంలో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. కాగా పల్లోంజీ మిస్త్రీకి ఇద్దరు కుమారులు షాపూర్ మిస్త్రీ, సైరస్ మిస్త్రీ, ఇద్దరు కుమార్తెలు లైలా మిస్త్రీ, ఆలూ మిస్త్రీ ఉన్నారు. సైరస్ మిస్త్రీ 2012 నుండి 2016 వరకు టాటా గ్రూప్ ఛైర్మన్‌గా పనిచేశారు. అయితే 2016 అక్టోబర్‌లో మిస్త్రీ చిన్న కుమారుడు సైరస్‌ను టాటా సన్స్ చైర్మన్ పదవి నుంచి తొలగించడంతో టాటా, మిస్త్రీల మధ్య వివాదం రగిలిన సంగతి తెలిసిందే.

# కేంద్రానికి వ్యతిరేకంగా మాట్లాడితే నోటీసులా

కేంద్రం తీరు రాజ్యాంగానికి వ్యతిరేకం ❑ఎన్సీపీ ఎంపి సుప్రియా సులే




**ముంబై, జూన్ 28 (అక్షర వెలుగు):** మహారాష్ట్ర రాజకీయాల్లో రోజుకో ట్విస్ట్ వెలుగుచూస్తోంది. పరిణామాలు వేగంగా మారుతున్నాయి. ఏక్‌నాథ్ షిండేతో పాటు ఆయన అనుచర ఎమ్మెల్యేలు 50మంది వరకూ అస్సాంలోని గౌహతిలో ఉన్న రాడిసన్ హోటల్ లో ఉన్నారు. ఉద్ధవ్ ఠాక్రే సర్కార్ పై తిరుగుబావుటా ఎగురవేసిన ఏక్ నాథ్ షిండే వర్గంపై ఎన్సీపీ అధినేత శరద్ పవార్ కూతురు, ఎంపీ సుప్రియా సూలే ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడే ప్రతిపక్ష నాయకులకు దర్యాప్తు సంస్థలతోనోటీసులు ఇప్పిస్తూ, ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి చర్యలు దేశానికి, రాజ్యాంగానికి అంత మంచివి కావన్నారు. శివసేన సీనియర్ నేత, ఎంపీ సంజయ్ రౌత్ కు ఈడీ నోటీసులు జారీ చేయడంపై సుప్రియా సూలే ఈ కామెంట్స్ చేశారు. ఇవాళ ఎన్సీపీకి వ్యతిరేకంగా మాట్లాడేవాళ్లలో చాలామంది ఒకప్పుడు తమ పార్టీలోనే ఉండేవారని, శివసేన అసమ్మతి ఎమ్మెల్యేలు దీపక్ ఖౌ, ఉదయ్ సమంత్ ఎన్సీపీ యువజన విభాగంలో పని చేశారని చెప్పారు. ఇవాళ సంకీర్ణ ప్రభుత్వానికి వ్యతిరేకంగా అసమ్మతి గళం వినిపించి.. తమను (ఎన్సీపీ) టార్గెట్ చేయడం చాలా బాధగా ఉందన్నారు. మహారాష్ట్రలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు శివసేన తిరుగుబాటు నేత ఏక్ నాథ్ షిండే కు 144 మెజారిటీ లేదని, ఆయనకు దాదాపు 50 మంది ఎమ్మెల్యేల మద్దతు మాత్రమే ఉందని ఎంపీ సుప్రియాసూలే అన్నారు. తాము సీఎం ఉద్ధవ్ ఠాక్రేకు మద్దతుగా ఉంటామని చెప్పారు.

# ఉక్రెయిన్‌పై రష్యా క్షిపణి దాడి

మాల్‌పై క్షిపణి దాడిలో 16మంది మృత్యువాత

మరో 59 మంది గాయపడ్డట్లు వెల్లడి

**కీవ్, జూన్ 28 (అక్షర వెలుగు):** ఉక్రెయిన్‌పై రష్యా దాడులు కొనసాగిస్తూనే ఉంది. ఉక్రెయిన్‌లోని సెంట్రల్ సిటీ క్రెమెన్‌చుక్‌లోని ఓ షాపింగ్ మాల్‌పై రష్యా క్షిపణి దాడి జరిపింది. రద్దీగా ఉండే మాల్‌పై దాడి జరుపడంతో 16 మంది మృత్యువాతపడ్డారు. మరో 59 మంది గాయపడ్డట్లు ఉక్రెయిన్ అత్యవసర సేవల అధిపతి సెర్గి క్రుక్ మంగళవారం వేకువ జామున ప్రకటించారు. షాపింగ్ మాల్‌పై మిస్సైల్ దాడి అనంతరం రెస్క్యూ పనులు, శిథిలాల తొలగింపు, మంటలను ఆర్పివేసే ప్రధాన పనులు కొనసాగుతున్నాయన్నారు. మిస్సైల్ దాడి సమయంలో మాల్‌లో వెయ్యి మందికిపైగా పౌరులు ఉన్నారని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీ పేర్కొన్నారు. మంటలతో ఫైటర్లు పోరాడుతున్నారని, బాధితుల సంఖ్యను ఊహించలేమని జెలెన్‌స్కీ ఫేస్‌బుక్‌లో పేర్కొన్న ఆయన.. ఓ వీడియోను పోస్ట్ చేశారు. అయితే, రష్యా క్షిపణి దాడిని నగర మేయర్ విటాలి మాలెట్‌స్కీ ఖండించారు. పౌర జనాభాపై విరక్తికరమైన తీవ్రవాద అచర్య అని పేర్కొన్నారు. ఉక్రెయిన్ విదేశాంగ మంత్రి డిమిట్రో కులేబా మరిన్ని భారీ ఆయుధాలను సరఫరా చేయాలని, రష్యాపై ఆంక్షలు విధించాలని మిత్ర దేశాలకు పిలుపునిచ్చారు. రష్యా మానవాళికి అవమానకరం, అది పర్యావసరాలను ఎదుర్కొవాలన్నారు.

## ముంబైలో కుప్పకూలిన భవనం

ఒకరు మృతి...శిథిలాల తొలగింపు

**ముంబై, జూన్ 28 (అక్షర వెలుగు):** ముంబై నాయక్ నగర్‌లో నాలుగు అంతస్తుల పాత భవనం గతరాత్రి కుప్పకూలింది. 20 నుంచి 25 మంది బిల్డింగ్ శిథిలాల కింద చిక్కుకున్నారు అధికారులు చెబుతున్నారు. రాత్రి నుంచి శిథిలాల తొలగింపు.. రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోంది. ఈ ప్రమాదంలో ఒకరు చనిపోగా.. 8 మందిని సురక్షితంగా రక్షించారు. సహాయక చర్యలు దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. ఘటనా స్థలానికి మహారాష్ట్ర మినిస్టర్ ఆదిత్య థాక్రే వెళ్లారు. రెస్క్యూ పనులను పరిశీలించారు. శిథిలావస్థలో ఉన్న 4 బిల్డింగులకు నోటీసులిచ్చామన్నారు

# కెసిఆర్‌తో తమిళిసై మాటామంతీ




ఇద్దరినీ కలిపిన రాజ్‌భవన్ కార్యక్రమం ◆ సిజె భూయాన్ ప్రమాణ స్వీకారోత్సవంలో కెసిఆర్

**హైదరాబాద్, జూన్ 28 (అక్షర వెలుగు):** గతతొమ్మిది నెలలుగా ఎడమొహం పెడమొహంగా ఉన్న సిఎం ఎసిఆర్, గవర్నర్ తమిళసైలను చీఫ్ జస్టిస్ ప్రమాణసవీకార కార్యక్రమం కలిపింది. సిజె జస్టిస్ ఉజ్జల్ భూయాన్ ప్రమాణస్వీకారానికి రాజ్‌భవన్ వచ్చిన సిఎం కెసిఆర్ అనివార్యంగా గవర్నర్ తమిళసైని కలువక తప్ప లేదు. సీఎం కేసీఆర్ రాజ్‌భవన్ కొన్ని నెలలుగా రాజ్‌భవన్‌వైపు చూసింది కూడా లేదు. గవర్నర్ కూడా సిఎం కెసిఆర్‌పై ఘాటుగానే విమర్శలు చేశారు. దీంతో ఇరువరి మధ్య మాటలు లేకుండా పోయాయి. తెలంగాణ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్ రావు మంగళవారం ఉదయం రాజ్‌భవన్‌లో అడుగుపెట్టారు. దాదాపు తొమ్మిది నెలల తర్వాత ఆయన గవర్నర్ అధికారిక భవనానికి రావడం గమనార్హం. తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి సీఎం కేసీఆర్ హాజరయ్యారు. గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌కు, తెలంగాణ సర్కార్ మధ్య గ్యాప్ పెరిగిన విషయం తెలిసిందే. అయితే.. సీజే ప్రమాణస్వీకార నేపథ్యంలో సీఎం కేసీఆర్ రాజ్‌భవన్‌కు రావడం ఆసక్తికరంగా మారింది. సీఎం కేసీఆర్, గవర్నర్ తమిళిసై ఇద్దరూ పక్కపక్కనే కూర్చున్నారు. తెలంగాణ హైకోర్టు కొత్త సీజేగా జస్టిస్ ఉజ్జల్ భూయాన్ ప్రమాణ స్వీకారం చేశారు. ఆయనతో గవర్నర్ తమిళిసై రాజ్‌భవన్‌లో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ ప్రమాణ స్వీకారోత్సవానికి కేసీఆర్ హాజరయ్యారు. ఈ క్రమంలో గవర్నర్, కెసిఆర్ ఇద్దరూ పక్కపక్కనే కూర్చొన్నారు. కానీ తొలుత కేసీఆర్, తమిళిసై ఇద్దరూ ఎడమొహం పెడమొహంగానే కనిపించారు. కేసీఆర్‌ను తమిళిసై పలకరించారు. కానీ కేసీఆర్ చూసీచూడనట్టుగా వ్యవహరించారు. కేసీఆర్ వ్యవహార శైలితో గవర్నర్ సైతం మౌనంగా ఉండాల్సి వచ్చింది. అనంతరం అల్పాహారం సమయంలో మాత్రం ఇద్దరూ ఆత్మీయంగా పలకరించుకున్నట్టే కనిపించింది. గత కొంత కాలంగా ప్రగతి భవన్ వర్సెస్ రాజ్‌భవన్ అన్నట్టుగా పరిస్థితులు మారిపోయాయి. క్రమక్రమంగా రాష్ట్రంలో రాజ్‌భవన్, ప్రగతి భవన్ మధ్య దూరం గ్యాప్ ఎవరూ పూడ్చలేని స్థాయికి చేరుకుంది. గతంలో టీఆర్ఎస్ పంపించిన కౌశిక్ రెడ్డి ఎమ్మెల్సీ ప్రతిపాదనను గవర్నర్ తిరస్కరించారు. ఇది ఇద్దరి మధ్య అభిప్రాయ బేధాలకు దారి తీసింది. అనంతరం రిపబ్లిక్ డే సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన స్పీచ్ కాపీలో రాష్ట్ర ప్రభుత్వ పథకాలతో పాటు కేంద్ర పథకాలను కూడా హైలెట్ చేస్తూ గవర్నర్ తమిళ సై ప్రసంగించడం సీఎం కేసీఆర్‌కు తీవ్ర ఆగ్రహాన్ని తెప్పించింది. ఇది కాస్తా అగ్గికి ఆజ్యం పోసినట్లైంది. ఆ తరువాత గవర్నర్ ప్రసంగం లేకుండానే బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం వంటి నిర్ణయాలు సీఎం, గవర్నర్‌ల మధ్య మరింత దూరం పెట్టాయి. మొత్తానికి 9 నెలల తర్వాత కేసీఆర్ రాజ్‌భవన్ మెట్లెక్కారు. కానీ అక్కడ ఆయన అంటీముట్టనట్టుగానే వ్యవహరించారు.

# రేవంత్‌కు కలిసి వస్తున్న దూకుడు

అధికార టీఆర్ఎస్‌పై ఎప్పటికప్పుడు ఎదురుదాడి◆రాహుల్ హెచ్చరికల తరవాత దారికొస్తున్న నేతలు



**హైదరాబాద్, జూన్ 28 (అక్షర వెలుగు):** తొలిసారిగా ఓ యువనాయకుడిని, సమర్థుడిని కాంగ్రెస్ పార్టీ తెలంగాణ అధ్యక్షుడిగా నియమించింది. రేవంత్ రెడ్డిని పిసిసి అధ్యక్షుడిగా చేయడంతో కాంగ్రెస్‌లో సమజంగానే ఉన్న విభేదాలు బయటపడ్డాయి. అయితే గతేడాదిగి కాంగ్రెస్ తీరులో మార్పు స్పష్టంగా గోచరిస్తున్నది. నిజానికి కాంగ్రెస్‌లో ఎవరికి వారు తామే పిసిసికి అర్హులమని, అవకాశమస్తే తామే సిఎంగా కూడా అర్హులమని చెప్పుకునే వారి జాబితా చాంతాడంత ఉంటుంది. జాబితే రాస్తూ పోతే ఎవరు కూడా మిగలక పోయినా ఆశ్చర్య పడనక్కర లేదు. తెలంగాణలో ఉన్న ప్రత్యేక పరిస్థితుల నేపథ్యంలో రేవంత్‌ను కాంగ్రెస్ అధిష్టానం పిసిసి చీఫ్‌గా నియమించిన తరవాత కాంగ్రెస్‌లో ఉత్తేజం వచ్చింది. దూకుడు వచ్చింది. దూకుడు కార్యక్రమాలతో మళ్లీ కాంగ్రెస్‌లో ఆశలు కూడా పెరిగాయి. తాము అధికారానికి చేరువ అవుతు న్నామన్న భావనా పెరిగింది. నిజానికి రేవంత్ మాత్రమే ఇప్పుడున్న పరిస్థితుల్లో కాంగ్రెస్ పార్టీకి ఆశలు కల్పించారు. యువతో ఉత్సాహాన్ని నింపే యంగ్ లీడర్‌గాఅవతరించారు. అధికార టిఆర్ఎస్‌ను వివిధ సందర్భాల్లో నిలదీసే వ్యక్తిగా నిలిచారు. టీపీసీసీ అధ్యక్షుడిగా రేవంత్ రెడ్డిని నియమిస్తూ కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయం తీసుకున్నదే తడవుగా కొందరు వ్యతిరేక స్వరాలు వినిపించారు. ఇది ముందునుంచీ ఊహిస్తున్నదే. అలాగే రేవంత్ రెడ్డిని ఎంపిక చేయడంపై ఆ పార్టీలోకి కొందరు నేతలు ఇప్పటికీ గుర్రుగా ఉన్నారు. వేరే పార్టీ నుంచి వచ్చిన వ్యక్తికి పీసీసీ పదవి ఎలా ఇస్తారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఇప్పుడు కాంగ్రెస్‌ను వీడిన నేతలను వెనక్కి రప్పించే కార్యక్రమాలు ముమ్మరం చేశారు. ఇటీవల తాటి వెంకటేశ్వర్లు, విజయారెడ్డి తదితరులు పార్టీలో చేరారు. ముమ్ముందు మరిన్ని చేరికలు ఉంటాయన్న సంకేతాన్ని రేవంత్ ఇస్తున్నారు. మరోవైపు టిఆర్ఎస్ విధానాలపై కాంగ్రెస్ దూకుడుగానే సాగుతోంది. ఇటీవల అగ్నిపథ్ కావచ్చు, ధాన్యం సేకరణ కావచ్చు, పోడు సమస్యలు కావచ్చు పిసిసి పిలుపుతో విజయవంతం అవుతున్నాయి. అయితే దీనిని కూడా సీనియర్ నేతలు తట్టుకోలేక పోతున్నారు. ఈ క్రమంలో ఇటీవల వరంగల్‌లో రాహుల్ పర్యటన తరవాత నేతలకు గగట్టి హెచ్చరికలు చేసారు. బహిరంగ విమర్శలు చేసేవారిని ఉపేక్షించబోమని కూడా రాహుల్ ప్రకటించారు. పార్టీ వేదికలపైన మాత్రమే చర్చించుకోవాలని, పత్రికలకు ఎక్కరాదని హెచ్చరిక చేశారు. దీంతో ఎంపి కోమటిరెడ్డి, జగ్గారెడ్డిల్లో మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. దీనికితోడు రేవంత్ కార్యక్రమాలపై ఎఐసిసి కూడా సంతృప్తిగానే ఉన్నట్లు సమాచారం వస్తోంది. కోమటి రెడ్డి సోదరుడు రాజగోపాల్ రెడ్డి కూడా ప్రస్తుతం ఎమ్మెల్యేగా ఉన్నారు. అయితే ఆయన బిజెపిలోకి వెళతానని చేసిన ప్రకటనలు కోమటిరెడ్డికి మైనస్‌గా మారాయి.




# చలన చిత్రం




## వరుస సినిమాలతో బిజీగా ప్రభాస్

### శరవవేగంగా సాగుతున్న సలార్ షూటింగ్

ఇటీవలే 'రాధేశ్యామ్'తో ప్రేక్షకులను తీవ్రంగా నిరాశ పరిచిన ప్రభాస్ తన తదుపరి సినిమాలపై ఫుల్ ఫోకస్ పెట్టాడు. ప్రస్తుతం ఈయన చేతిలో నాలుగు సినిమాలనున్నాయి. ప్రభాస్ ప్రస్తుతం వరుస పాన్ ఇండియా సినిమాలతో తీరిక లేకుండా గడుపుతున్నాడు. అందులో ప్రశాంత్‌నీల్ ప్రాజెక్ట్ ఒకటి. ఇప్పటికే ఈ కాంబోపై ప్రేక్షకులలో భారీ స్థాయిలో అంచనాలు నెలకొన్నాయి. ఇక 'కేజీఎఫ్ చాప్టర్-2' చూసిన తర్వాత సలార్ సినిమాపై అంచనాలు తారా స్థాయికి చేరాయి. చాప్టర్-2 చూసిన ప్రేక్షకులు సలార్‌లో ప్రభాస్‌ను నీల్ ఏ రెంజ్‌లో చూపిస్తాడో అని ఆత్రుత మొదలైంది. ఇదిలా ఉంటే ఈ చిత్రానికి సంబంధించిన షూటింగ్ అప్‌డేట్ బయటకు వచ్చింది. సలార్ మేజర్ షెడ్యూల్ మంగళవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ఈ షెడ్యూల్‌లో ప్రశాంత్‌నీల్ యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరించనున్నాడు. ఈ చిత్రంలో ప్రభాస్ డ్యూయల్ రోల్‌లో నటించనున్నాడు. శృతి హాసన్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రానికి రవిబస్రూర్ సంగీతం అందిస్తున్నాడు. 60శాతం షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇక ప్రభాస్ లేటెస్ట్‌గా నటించిన 'ఆదిపురుష్' వచ్చే ఏడాది జనవరి 12న విడుదల కానుంది. మైథలాజికల్ డ్రామాగా తెరకెక్కిన ఈ చిత్రాన్ని 'తన్హాజీ' ఫేం ఓ రౌత్ తెరకెక్కించాడు. దీనితో పాటుగా నాగ్ అశ్విన్‌తో 'ప్రాజెక్ట్-ఐ' చిత్రాన్ని చేస్తున్నాడు. అత్యంత భారీ బ్జడెట్‌తో పాన్ వరల్డ్ సినిమాగా ఈ చిత్రాన్ని అశ్వినీదత్ రూపొందిస్తున్నాడు.




## మరో డిఫరెంట్ రోల్‌లో అల్లరి నరేశ్

### పూర్తి కావస్తున్న ఇట్లు మారేడుమిల్లి నియోజకవర్గం

చాలా కాలం తర్వాత 'నాంది'తో సూపర్ హిట్ విజయాన్ని సాధించాడు అల్లరినరేష్. గత కొన్నేళ్ళ నుండి కామెడీ సినిమాలను చేస్తూ ప్రేక్షకులను నవ్విస్తున్న నరేష్ నాందితో పూర్తి స్థాయి సీరియస్ పాత్రలో నటించి తన నటన కేపబులిటీస్‌ను మరోసారి నిరూపించాడు. ప్రస్తుతం ఈయన రెండు సినిమాలను సెట్స్ పైన ఉంచాడు. అందులో 'ఇట్లు మారేడుమిల్లి నియోజకవర్గం' ఒకటి. ఏ.ఆర్ మోహన్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఇప్పటికే చిత్రం నుండి విడుదలైన పోస్టర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. తాజాగా ఈ సినిమా ప్రీ టీజర్‌ను మేకర్స్ విడుదల చేశారు. లేటెస్ట్‌గా విడుదలైన టీజర్‌లో షూటింగ్‌కు సంబంధించిన లోకేషన్లను చూపుతూ 55రోజుల షూటింగ్‌లో ప్రతి లోకేషన్‌కు చేరుకోవడానికి దాదాపు నాలుగు గంటల సమయం పట్టేదని టీజర్‌లో చూపించారు. వంజంగీ హిల్స్‌కు ఉదయం 3 గంటల నుండి 6 కిలోమీటర్లు ట్రెక్కింగ్ చేసినట్లు తెలిపారు. అంతేకాకుండా 22 అన్‌ఎక్స్‌ప÷-లోరుడ్ లోకేషన్లలో 250మంది యూనిట్ సభ్యులతో షూటింగ్ జరిపినట్లు ప్రీ టీజర్‌లో చూపించారు. మొత్తంగా టీజర్ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంటుంది. ఈ చిత్రానికి మేకర్స్ పెట్టిన ఎఫర్ట్స్ కళ్ళకట్టినట్లు కనిపిస్తున్నాయి. ఈ ప్రీ టీజర్‌తో చిత్రబృందం సినిమాపై అంచనాలను పెంచింది. ఈ చిత్రంలో అల్లరినరేష్ ఎలక్షన్ అధికారిగా కనిపించనున్నాడు. 'శ్రీదేవి సోడా సెంటర్' ఫేం ఆనంది ఈ చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తుంది. శ్రీచరణ్ పాకాల సంగీతం అందిస్తున్న ఈ చిత్రానికి రామ్ రెడ్డి ఛాయగ్రహకుడిగా పనిచేస్తున్నాడు. అబ్బూరి రవి మాటలు అందిస్తున్నాడు. జీ స్టూడియోస్, హాస్య మూవీస్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి.



## రంగమార్తాండ కోసం చిరంజీవి కొత్త అవతారం

### సినిమాలో షాయరీ వినిపించనున్నట్లు టాక్

మెగాస్టార్ చిరంజీవి ఇటు సినిమాల్లో బిజీగా ఉంటూనే.. ఇతర చిత్రాల ప్రచారంలో తనవంతు పాత్ర పోషిస్తున్నారు. ఈ నేపథ్యంలో చిరంజీవి ఇప్పుడో సినిమా విషయంలో తన కెరీర్‌లోనే సమ్ థింగ్ స్పెషల్ అనదగ్గ రీతిలో ఒక సినిమాను ప్రమోట్ చేయబోతున్నారు. ఆ చిత్రం 'రంగమార్తాండ' . క్రియేటివ్ డైరెక్టర్ కృష్ణవంశీ దర్శకత్వంలో రూపొందుతోన్న ఈ సినిమాలో ప్రకాశ్‌రాజ్ ప్రధానపాత్ర చేస్తున్నారు. మరాఠీ సూపర్ హిట్ 'నటసమ్రాట్' సినిమాకిది అఫీషియల్ రీమేక్. నానా పాటేకర్ ప్రధాన పాత్ర పోషించిన ఈ సినిమాకి అక్కడ మంచి పేరొచ్చింది. ఈ సినిమాను కృష్ణవంశీ తనదైన శైలిలో తెలుగు నేటివిటీకి అనుగుణంగా తీర్చిదిద్దారు. షూటింగ్ చివరిదశకు చేరుకున్న 'రంగమార్తాండ' చిత్రానికి మాస్ట్రో ఇళయరాజా సంగీతం అందిస్తున్నారు. ఇక ఈ సినిమాను దర్శకుడు ఒక అందమైన నెరేటివ్ స్టైల్లో తెరపై ఆవిష్కరించబోతున్నారు. దాని కోసం మెగాస్టార్ చిరంజీవిని రంగంలోకి దింపుతున్నారని టాక్. చిరంజీవి ఈ సినిమా కోసం తన కెరీర్ లోనే మొట్టమొదటి సారిగా షాయరీ వినిపించబోతున్నారట. రెగ్యులర్ వాయిస్ ఓవర్ కు చాలా భిన్నమైనది ఈ షాయరీ. సినిమాలోని ఎమోషన్‌ను బలంగా క్యారీచేయడానికి షాయరీ ఎంతగానో తోడ్పడుతుంది. దానికి చిరంజీవి వాయిసే బెటర్ ఛాయిస్ అని కృష్ణవంశీ భావిస్తున్నారట. ఆ మేరకు చిరు నుంచి గ్రీన్ సిగ్నల్ కూడా వచ్చిందట. ఈ షాయరీతో ప్రేక్షకుల హృదయాల్ని ఎమోషనల్ గా టచ్ చేయొచ్చన్నది కృష్ణవంశీ ఆలోచన. నిజానికి షాయరీ అంటే.. ఒక డైలాగ్ కాదు, ఒక పాట కాదు.. అదొక అందమైన పొయటిక్ ఎక్స్‌ప్రెషన్. ఆ ప్రక్రియను 'రంగమార్తాండ' చిత్రం కోసం కృష్ణవంశీ ప్రేక్షకుల ముందుకు తీసుకురావడం విశేషాన్ని సంతరించుకుంది. దీనికి ఇళయరాజా అద్భుతమైన నేపథ్య సంగీతం కూడా తోడైతే.. 'రంగమార్తాండ' చిత్రం ప్రేక్షకుల్ని ఎమోషనల్ గా బాగా కదిలించే అవకాశాలున్నాయి. మరి చిరు షాయరీ.. ఈ సినిమాకి ఏ స్థాయిలో హైలైట్ అవుతుందో చూడాలి.



## వచ్చేయేడు సెట్స్‌పైకి మహేశ్‌తో రాజమౌళి సినిమా

దర్శకధీరుడు రాజమౌళితో సినిమా అంటే ఈజీగా రెండేళ్లు పడుతుంది. అంతకంటే ఎక్కువ సమయం పట్టినా ఆశ్చర్యపోనక్కర్లేదు. అయితే మహేశ్ బాబుతో తీయబోయే సినిమా మాత్రం పక్కా రెండేళ్లలో పూర్తి చేస్తానని చెబుతున్నాడు. కానీ ఆ మాట నిలబెట్టుకుంటాడా లేదా అన్నది రేండేళ్లు ఆగితే కాని తెలియదు. ఇప్పటి వరకు అయితే ఇచ్చిన మాట రాజమౌళి ఎప్పుడు నిలబెట్టుకోలేదు. రాజమౌళి గురించి తెలిసి కూడా మహేశ్ బాబు కొత్తసినిమా పై ఇప్పుడే ఫోకస్ పెట్టడం ఇండస్ట్రీ వర్గాలను ఆశ్చర్యపరుస్తు న్నాయి. మహేశ్ కెరీర్ లో తెరకెక్కే 30 చిత్రానికి దర్శకుడు ఎవరూ అనేది ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. రాజమౌళితో మూవీ తర్వాత సుకుమార్ లేదా సందీప్ వంగాతో సినిమా చేసేందుకు మహేశ్ ఇప్పటి నుంచే చర్చలు జరుపుతున్నాడట. అదే నిజమైతే సూపర్ స్టార్ ఫ్యాన్స్ కు పండగే. కాని ఈ ప్రాజెక్ట్ పట్టాలెక్కాలంటే ముందు రాజమౌళితో మూవీ కంప్లీట్ కావాల్సి ఉంటుంది.
సూపర్ స్టార్ మహేశ్ బాబు ప్రస్తుతం సర్కారు వారి పాట సక్సెస్ ను ఎంజాయ్ చేస్తున్నాడు. ఫ్యామిలీతో కలిసి యూరప్ ట్రిప్ వేశాడు. తిరిగి ఇండియాకు రాగానే త్రివిక్రమ్ మూవీని పట్టాలెక్కించనున్నాడు. 2023 ప్రారంభంలో రాజమౌళి- మహేశ్ బాబు కొత్త సినిమా ప్రారంభం కానుంది.

## ఏక్ విలన్ రిటర్న్స్..జూలై29న విడుదల

బాలీవుడ్ ప్రముఖ దర్శకులలో మోహిత్ సూరి ఒకరు. ఆయన దర్శకత్వంలో శ్రద్ధా కపూర్, సిద్దార్థ్ మల్హోత్ర, రితేష్ దేశ్‌ముఖ్ ప్రధాన తారగణంగా నటించిన చిత్రం 'ఏక్ విలన్'. 2014లో విడుదలైన ఈ సినిమా మంచి విజయం సాధించింది. తర్వాత ఈ సినిమాకు కొనసాగింపుగా సీక్వెల్ తెరకెక్కిస్తున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఈ సీక్వెల్‌పై అంచనాలు ఏర్పడ్డాయి. అయితే ఈ సీక్వెల్‌లో ఎవరు నటించనున్నారనే విషయం ఆసక్తికరంగా మారింది. ఈ సినిమాలో నటించే నటీనటులను దర్శకనిర్మాతలు కొన్నాళ్ళుగా రహస్యంగా ఉంచగా, తాజాగా వారి పేర్లను బయటపెట్టారు. సుమారు ఎనిమిదేళ్ల తర్వాత నిరీక్షణకు తెరదింపారు. 'ఏక్ విలన్'కు సీక్వెల్‌గా వస్తున్న 'ఏక్ విలన్: రిటర్న్స్' చిత్రంలో అర్జున్ కపూర్, జాన్ అబ్రహం, దిశా పటానీ, తారా సుతారియా కీలక పాత్రలు పోషిస్తున్నారు. దీనికి సంబంధించిన పోస్టర్లను 'విలన్ల లోకంలో హీరోలకు చోటులేదు' అనే క్యాప్షన్‌తో విడుదల చేశారు. యాక్షన్, సస్పెన్స్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ మూవీకి మోహిత్ సూరి దర్శకత్వం వహించారు. ఈ చిత్రం జులై 29న ప్రేక్షకుల ముందుకు రానుంది.






## యానిమల్ హిందీ సినిమాలో సమంత ఐటమ్ సాంగ్

స్టార్ హీరోయిన్ సమంత మరో స్పెషల్ సాంగ్ ఒప్పుకుందా..? ప్రస్తుతం సోషల్ మీడియాలో ఇదే వార్త వచ్చి వైరల్ అవుతోంది. తెలుగులో అర్జున్ రెడ్డి సినిమాతో సంచలన దర్శకుడిగా అసాధారణమైన క్రేజ్ తెచ్చుకున్న దర్శకుడు సందీప్ రెడ్డి వంగ ఈ సినిమాను హిందీలో కూడా ఆయనే రూపొందించి భారీ హిట్ అందుకున్నాడు. అక్కడ షాహిద్ కపూర్, కియారా అద్వానీ జంటగా నటించారు. అప్పటివరకూ ఉన్న క్రేజ్ కంటే షాహిద్ నటించిన అర్జున్ రెడ్డి హిందీ రీమేక్ కబీర్ సింగ్ రెట్టింపు పాపులారిటీని తెచ్చిపెట్టింది. దాంతో బాలీవుడ్ హీరోలు సందీప్ రెడ్డి వంగతో సినిమా చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. ఈ క్రమంలోనే బాలీవుడ్ హీరో రణబీర్ కపూర్ - సందీప్ రెడ్డి వంగల కాంబినేషన్‌లో 'యానిమల్' అనే సినిమా తెరకెక్కుతోంది. ఈ సినిమాలో ముందు పరిణీతి చోప్రాని హీరోయిన్‌గా ఫిక్స్ చేసుకున్నారు. అయితే, డేట్స్ సర్దుబాటు కాకపోవడంతో ఆ అవకాశం క్రేజీ బ్యూటీ రష్మిక మందన్నకు దక్కిందని వార్తలు వస్తున్నాయి. ఇదిలా ఉంటే ఇదే సినిమాలో సమంత కనిపించబోతుందని ప్రస్తుతం టాక్ వినిపిస్తోంది.ఈ మూవీలో ఓ ఐటెం సాంగ్ ఉందని దీనికోసం పలువురు స్టార్ హీరోయిన్స్‌ను సంప్రదిస్తున్నారని ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలోనే తాజాగా 'యానిమల్' బృందం సమంతను సంప్రదించిందట. పుష్ప సినిమాలో ఆమె చేసిన 'ఊ అంటావా మావా ఊహూ అంటావా మావా' సాంగ్ చేసి ఓ ఊపు ఊపేసింది. ఈ సాంగ్‌తో సమంతకు మంచి క్రేజ్ వచ్చింది. అందుకే, మేకర్స్ 'యానిమల్' సినిమాలో ఉన్న ఐటెం సాంగ్‌కు సమంతను తీసుకోవాలని ప్లాన్ చేస్తున్నారని టాక్.

## కార్తి సినిమాను విడుదల చేయనున్న నాగ్




నాగార్జున-కార్తీ కాంబినేషన్‌లో 'ఊపిరి' తర్వాత మరో సినిమా రానుంది. 'ఊపిరి'లో ఈ ఇద్దరూ నటించిన విషయం తెలిసిందే. అయితే ఈసారి మాత్రం నటులుగా కాదు.. వీరి కాంబినేషన్ రిపీట్ కానున్నది నిర్మాత, హీరోగా. కార్తీ హీరోగా నటిస్తున్న తమిళ చిత్రం 'సర్దార్'ని తెలుగు రాష్ట్రాల్లో అన్నపూర్ణ స్టూడియోస్ పతాకంపై నాగార్జున విడుదల చేయనున్నారు. ఈ చిత్రం తెలుగు పంపిణీ హక్కులను సొంతం చేసుకున్న విషయాన్ని సోమవారం ప్రకటించారు. ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్ జరుగుతోంది. ఈ యాక్షన్ థ్రిల్లర్‌ని తెలుగు, తమిళ భాషల్లో దీపావళికి రిలీజ్ చేయనున్నట్లు చిత్రబృందం పేర్కొంది. రాశీ ఖన్నా కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి 'అభిమన్యుడు' ఫేమ్ పీఎస్ మిత్రాన్ దర్శకత్వం వహిస్తున్నారు. అలాగే సంగీతం జీవీ ప్రకాష్ కుమార్ అందిచగా, కెమెరా బాధ్యతలను జార్జ్ సి. విలియమ్స్ చేపట్టారు.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **GPR PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
TITLE CODE.TELTEL02057, Cell:8464816456 Email: aksharavelugudaily@gmail.com, Website: www.aksharavelugu.com